మైనర్లకు బండిస్తే.. ఆర్సీ రద్దు

డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన మైనర్ల ఎదుటే వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వద్దంటూ ఎన్నిసార్లు హెచ్చరించినా పేరెంట్స్ పట్టించుకోవడంలేదు. దీంతో పట్టణంలో మైనర్ల డ్రైవింగ్‌పై కేసులు పెరిగాయని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.



వాహనం నడుపుతున్న మైనర్లు (ఫైల్)

అర్హత లేకున్నా.. డ్రైవింగ్

- ర్యాష్ డ్రైవింగ్‌పై పెరుగుతున్న కేసులు
- మైనర్ల ముందే పేరెంట్స్‌కు కౌన్సెలింగ్..
- ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్న ట్రాఫిక్ పోలీసులు
- చట్టపరమైన చర్యలకు సిద్ధం

సంగారెడ్డి క్రైమ్: తమ పిల్లలు మారం చేశారని, కాస్త దూరమనే ఉద్దేశంతో వాహనం ఇచ్చి తల్లిదండ్రులు పంపుతున్నారు. చిన్న వయసులోనే వాహనాలు నేర్చుకోవాలనే తాపత్రయంతో మైనర్లకు వాహనాలు ఇచ్చే ముందు ఒకసారి ఆలోచించాలి. డ్రైవింగ్ విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిందేనని సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ పేరెంట్స్‌కు పలు సూచనలు తెలియజేశారు. తెలిసి తెలియని వయసులో మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో వారితో పాటు ఎదుటివారి ప్రాణాలను బలి తీసుకుంటున్నారు. మైనర్ డ్రైవింగ్ కట్టడి చేయాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం పట్టణ ట్రాఫిక్ పోలీసులు దిద్దుబాటు చర్యలకు సిద్ధమయ్యారు. సోమవారం నుంచి పట్టణ వ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు.

చట్టపరమైన చర్యలు

పట్టణంలో మైనర్లు వాహనం నడుపుతూ పట్టుపడితే తల్లిదండ్రులపై, వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తాం. న్యాయస్థానంలో జరిమానా లేదా జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది. వాహన యజమాని రిజిస్ట్రేషన్ ఆర్సీని కూడా 12 నెలల పాటు సస్పెండ్ చేస్తారు. ఐదేళ్ల వరకు జైలు శిక్ష రూ.25 వేల జరిమానా విధించే అవకాశం ఉంది. సదరు మైనర్‌కు 25 ఏళ్లు వచ్చే దాకా డ్రైవింగ్ లైసెన్స్ పొందే అర్హత కోల్పోతాడు. ట్రాఫిక్ నిబంధనల నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సీఐ హెచ్చరించారు. జాతీయ రహదారి భద్రత చర్యల్లో భాగంగా పోలీసులు చేపడుతున్న ప్రత్యేక తనిఖీలకు ప్రజల సహకారం అందించాలని పట్టణ సీఐ కోరారు.

వాహనాలిస్తే చర్యలు తప్పవు



మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం. వాహనం ఇచ్చిన యజమాని తల్లిదండ్రులకు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. చిన్న వయసులో అతివేగంగా వాహనం నడపడాన్ని సరదాగా భావిస్తారు. వాహనాన్ని నియంత్రించలేరు. చుట్టూ ఉన్న పరిస్థితులను అంచనా వేయలేరు. వాహనాలు నడిపే సమయంలో పట్టు కోల్పోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్యను అధిగమించేందుకు తల్లిదండ్రుల సహకారం చాలా ముఖ్యం. తమ పిల్లల ఇష్టపడుతున్నారని ఇతర కారణాలతో డ్రైవింగ్ లైసెన్స్ రాకముందే వాహనం చేతికి ఇవ్వద్దు.

– సీఐ సుమన్‌కుమార్

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలోఅభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రూ.4.58కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధికి పెద్దపీట వేస్తూ మున్సిపల్ పరిధిలో ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించనున్నట్లు చెప్పారు. ఇటీవల మున్సిపల్ పాలకవర్గం ప్రతిపాదించిన పనులకు ఆర్థికశాఖ ద్వారా అనుమతులు మంజూరు చేయించి త్వరలో పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రాములుగౌడ్, మాజీ సర్పంచ్‌లు సోమిరెడ్డి, లక్ష్మణ్, స్వామిగౌడ్, రాములుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు తదితరులు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

పటాన్‌చెరు: ఆపదకాలంలో సీఎం సహాయనిధి నిరుపేదలకు ఆపన్నహస్తం అందిస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్‌కు చెందిన సమద్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్య కోసం ఎమ్మెల్యే సహకారంతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయగా లక్ష రూపాయల ఎల్‌ఓసీ మంజూరయింది. సోమవారం ఎల్‌ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే సమద్ కుటుంబసభ్యులకు అందజేశారు.

మండల అభివృద్ధికి సహకరించండి

బీఆర్‌ఎస్ నాయకుడు గోవర్ధన్ రెడ్డి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): మండల అభివృద్ధికి 50 ఎకరాల స్థలాన్ని కేటాయించాల్సిందిగా బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్ 109లోఅసైన్డ్ భూములుగా ఉన్న 150 ఎకరాలను ప్రభుత్వం ఐటీ ఇండస్ట్రియల్ పార్కు కోసం కేటాయించిందన్నారు. ఈ భూమి నుంచి 50 ఎకరాల స్థలం ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేటాయించాలని అధికారులను కోరినట్లు తెలిపారు. రైతులు పండించిన పంటలు నిల్వ చేసేందుకు గోదాంలు అవసరమన్నారు. పొరుగు పట్టణాలకు వెళ్లకుండా విద్యార్థుల జూనియర్ కళాశాలు, క్రీడల ప్రాంగణాల ఏర్పాటు కోసం 5 స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

విరిగిన విద్యుత్ స్తంభాలు.. కూలిన భారీ వృక్షాలు



కళాశాల ఆవరణలో విరిగిన చెట్లు

హత్నూరలోని డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ జూనియర్ కళాశాలలో గాలివానతో సోమవారం సాయంత్రం విద్యుత్ స్తంభాలు, చెట్లు నేల కూలాయి. దీంతో మండలంలోని పరిసర గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. కళాశాలలో నీట్, ఎంసెట్ కోసం కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది.

–హత్నూర (సంగారెడ్డి)

క్లుప్తంగా

ఎరువులు అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

మునిపల్లి(అందోల్): రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని రాయికోడ్ వ్యవసాయ సంచాలకులు సత్యనారాయణ ఫర్టిలైజర్ దుకాణ నిర్వాహకులను కోరారు. సోమవారం మునిపల్లి రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారి స్నేహ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. త్వరలోనే సీజన్ ప్రారంభం కాబోతున్న క్రమంలో నిర్వాహకులు గోడౌన్‌లో ఎరువులను నిల్వ చేసి రైతులకు సరిపడ సరఫరా బాధ్యత డీలర్లపైనే ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఫర్టిలైజర్ షాపు నిర్వాహకులు ఉన్నారు.

రైతుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యం



ధాన్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నేతలు

వట్‌పల్లి(అందోల్): రైతుల ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం అందోల్ మండలంలోని కన్‌సాన్‌పల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాలయ్య, నాయకులు మహిపాల్, క్రిష్ణ, పార్టీ గ్రామ అధ్యక్షుడు వీరేశం, ఐకేపీ వీఓఆర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం



అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సదాశివపేట(సంగారెడ్డి): ప్రతి ఒక్కరూ ప్రజలకు ఏదో రూపంలో సేవ చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చీలమల్లన్న తండ్రి బస్వరాజ్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆకుల శివ, శాంత్‌కుమార్, రాజు, శ్రీనివాస్, గందిగరాజు, అంజయ్య, శ్రీశైలం, శ్రీధర్‌రెడ్డి, నర్సింలు, నాసిర్, జబ్బార్, విజయ్, బరాడి శివ పాల్గొన్నారు.

చర్చి నిర్మాణాన్ని అడ్డుకోండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని దాచారం కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న చర్చిని ఆపాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోరారు. సోమవారం తహసీల్దార్ భిక్షపతి, గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ జైత్రం నాయక్‌ను కాలనీవాసులతో కలిసి వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వ భూమిలో చర్చి నిర్మాణాన్ని నిలిపివేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జగన్ రెడ్డి, నాయకులు లక్ష్మణరావు, హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి సంగారెడ్డి పాత బస్టాండ్ వద్ద, జాతీయ రహదారి, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 13మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. తనిఖీల్లో 18 మంది అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో 'విద్యా ప్రవేశ్'



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఝరాసంగం(జహీరాబాద్): 2025–26 విద్యా సంవత్సరం కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశం ప్రారంభమయింది. సోమవారం మండలంలోని మాచ్నూర్ గ్రామ శివారులోని పాఠశాలలో 1వ తరగతిలో ఎంపికైన విద్యార్థుల కోసం 'విద్యా ప్రవేశ్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ముందుగా విద్యాలయ ప్రిన్సిపాల్ పవన్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కేంద్రీయ విద్యాలయ నియమ నిబంధనలను వివరించారు. సెలవుల్లో తమ పిల్లలను అప్రమత్తంగా చూసుకోవాలని కోరారు. కొత్తగా చేరిన విద్యార్థుల తల్లిదండ్రుల చేతుల మీదుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండ

సదాశివపేట(సంగారెడ్డి): సరస్వతి శిశుమందిరం ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఐదుగురు పేద విద్యార్థుల ఏడాది ఫీజు రూ.91000 వేల చెక్కును సోమవారం శ్రీరామ్ అరుణ ఫ్యామిలీ ఫౌండేషన్ ట్రెజరర్ బొజ్జ మధుసూదన్, పాఠశాల కార్యదర్శి సరాఫ్ శ్రీనివాస్, హెచ్‌ఎం సంగమేశ్వర్‌లకు అందజేశారు. బుద్ధ పౌర్ణను వాసవీ క్లబ్ హైదరాబాద్ వాసవీ క్లబ్ సమితి సదాశివపేట సహకారంతో శ్రీరామ్ అరుణ గుప్తా ఫ్యామిలీ ఫౌండేషన్ చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా సంవత్సరం ఫీజు చెక్కు రూపంలో అందించినట్లు పాఠశాల కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.



చెక్కు అందజేసిన ఫౌండేషన్ సభ్యులు

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

పటాన్‌చెరు టౌన్: మియాపూర్ నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు, ఇండ్లు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ రంగారావు కు వినతి పత్రం అందజేశారు. నాగేశ్వరావు మాట్లాడుతూ.. జాతీయ రహదారి విస్తరణ మియాపూర్ నుంచి సంగారెడ్డి చౌరస్తా వరకు రూ .1350 కోట్ల పనులు జరుగుతున్నాయని, ఇందులో రూ .700 కోట్లు రహదారి నిర్మాణానికి, రూ.650 కోట్ల భూములు ఇండ్లు కోల్పోతున్న నిరాశ్రయులకు నష్టపరిహారం ఇవ్వడం కోసం నేషనల్ హైవే సంస్థ కేటాయించడం జరిగిందని చెప్పారు. కాని రుద్రారం ,ముత్తంగి గ్రామాల్లో జాతీయ రహదారి విస్తరణ పనులు జోరుగా జరుగుతున్న ఆ గ్రామా ల్లోని రైతుల భూములను పరిగణలోకి తీసుకోవ డం లేదని, ఆ భూముల్లో పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. నేషనల్ హైవే వారు చేస్తున్న పనుల వల్ల రైతులు గందరగోళానికి గురవుతున్నారన్నారు. ఏఅధికారులను కలవాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. రైతులు రవీందర్, రాములు, మహేందర్ రెడ్డి, విజయభాస్కర్, చంద్రయ్య, ప్రహ్లాదరెడ్డి, అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.

దాహం తీర్చేందుకు చల్లని నీరు



జహీరాబాద్: మండలం పరిధి శేఖాపూర్‌లోని హజ్రత్ షేక్ షాబుద్దీన్ దర్గా వద్ద 17 మట్టి గోళెం(కుండ)లను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చుతున్నారు. తాండూరు రహదారిపై ఉన్న దర్గా ముందు భాగంలో కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బోరు ఏర్పాటు చేసి గోళెంల్లో నీటిని నింపి దారిన వెళ్లే ప్రజలకు చల్లని నీరు అందుబాటు ఉంచారు. ఈ మేరకు నీటిని అందుబాటులో ఉంచిన దర్గా కమిటీ సభ్యులకు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రజతోత్సవ సభకు తరలిరావాలి

ఝరాసంగం(జహీరాబాద్): ఈ నెల 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు బీఆర్‌ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఝరాసంగంలో పార్టీ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండలాల అధ్యక్షుడు వెంకటేశం, నారాయణ, సంజీవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆచార్య స్కూల్‌లో సోమవారం గ్రాడ్యుయేషన్‌డేను ఘనంగా నిర్వహించారు. ప్రీ ప్రైమరీ పూర్తి చేసి 1వ తరగతి ప్రవేశించిన విద్యార్థులకు పట్టా, మెడల్స్ ప్రదానం చేశారు. ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోసెస్, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

◆ ఘనంగా అంగన్‌వాడీ దినోత్సవం

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం బ్రాహ్మణగూడా అంగన్‌వాడీ కేంద్రంలో స్కూల్ డే కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించినట్లు అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు అనసూయ తెలిపారు. స్కూల్ డే కార్యక్రమంలో భాగంగా ఐదు సంవత్సరాల నిండిన పిల్లల తల్లిదండ్రులకు పూర్వ ప్రాథమిక విద్య గురించి అవగాహన కల్పించారు. పిల్లలు చేసిన కృత్యాలు గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు అసెస్మెంట్ కార్డులు ఇవ్వడం ఇవ్వడంతో పాటు పిల్లల తల్లిదండ్రులకు కాటుపై అవగాహన కల్పించారు.

◆ అంగాన్‌వాడీలో పోషణ్ పక్వాడ

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ మండలంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత మాట్లాడుతూ.. గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణీలకు సీమంతలు చేశారు. చిన్న పిల్లలకు అక్షరభ్యాసం, అన్నప్రసాదం, ఇతర కార్యక్రమాలు చేపట్టారు. తహసీల్దార్ శివశ్రీనివాస్, డాక్టర్ జెబ, ఎంఈఓ శ్రీనివాస్‌లు, ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత, సూపర్‌వైజర్ సుజాత రాథోడ్, ఏపీఎం సాయిలు, టీచర్లు పాల్గొన్నారు.

◆ స్నేహితుల కుటుంబాలకు చేయూత

జిన్నారం (పటాన్‌చెరు): చిన్ననాటి స్నేహితుల కుటుంబాలకు తోటి స్నేహితులు మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే.. జిన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దమ్మగూడెం గ్రామానికి చెందిన గుర్రాల నరేష్ యాదవ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. జిన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003–04 పదో తరగతి చదివిన తోటి స్నేహితుడు ఆకస్మాత్తుగా మృతి చెందడం ఎంతో బాధాకరమని స్నేహితుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్నేహితుడి భార్యాబిడ్డలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం కొడకంచి గ్రామానికి చెందిన మరో స్నేహితుడు భిక్షపతి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆరోగ్య స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం మిత్రబృందం ఆర్థిక చేయూత అందజేశారు.

◆ అఖండ హరినామ సప్తహ ప్రారంభం

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధి భూమయ్య కాలనీలోని శివ పంచాయతన శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో అఖండ హరినామ సప్తాహ మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. మొదటి రోజున దెగుల్‌వాడికి చెందిన వెంకటరావు దేశాయి మహరాజ్, కమలాపూర్‌కు చెందిన వామన్‌రావు మహరాజ్ ప్రవచనాలు ఇచ్చారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

◆ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నందికంది ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం మండల విద్యాధికారి శంకర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోని నాణ్యమైన విద్యా అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రవేశాలు కల్పించాలని కోరుతూ వాల్ పోస్టర్ రూపొందించిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

◆ 30న సామాజిక సమరతసభ

నారాయణఖేడ్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సమరత రథయాత్ర ఈనెల 30న ఖేడ్‌కు చేరుకొనుందని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రజనీకాంత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం తెలిపారు. అదేరోజు సా.6 గంటలకు ఖేడ్‌లోని అప్పారావు షెట్కార్ విగ్రహం వద్ద సామాజిక సమరత సభను నిర్వహించారు. కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఖేడ్ పట్టణంలో పంపిణీ చేశారు.

◆ నేడు భూభారతిపై అవగాహన

కంగ్టి(నారాయణఖేడ్): భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని తడ్కల్ దేవి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సదస్సుకు జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా అదనపు కలెక్టర్ ఆర్‌డీ మాధురి, ఆర్డీఓ అశోక్ చక్రవర్తి రెవెన్యూ సిబ్బంది పాల్గొననున్నారు.

◆ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు సత్తాచాటాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజుగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని ఇబ్రితాబాద్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు ఆదిత్య అధ్యక్షతన సంఘటన సంరచన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధికార ప్రతినిధి రాజుగౌడ్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, ఇటీవల నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్యకర్తలు కృషి చేసి బీజేపీ అభ్యర్థిని గెలిపించారని తెలిపారు.

◆ కొనసాగుతున్న సర్వే

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు సిద్ధంగా ఉన్న వారిని గుర్తించేందుకు అధికారులు నిర్వహిస్తున్న సర్వే కొనసాగుతుంది. సోమవారం మండలంలోని మిర్జాపూర్(బి), అమీరాబాద్, హద్నూర్ తదితర గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎంపీడీఓ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సమావేశమై ఇళ్లు నిర్మించుకునే వారితో మాట్లాడారు.

◆ నీటి గుంతల పనులపై అవగాహన

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధి హామీ పథకం కింద కల్హేర్‌లో సోమవారం నీటి గుంతల నిర్మాణం పనులు చేపట్టారు. రైతు నర్సింహారెడ్డి వ్యవసాయ భూమిలో ఉపాధి హామీ కూలీలతో నీటి గుంతల పనులు చేశారు. ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్ రఘువీర్ కూలీలకు పనిచేసే విధానంపై అవగాహన కల్పించారు.

తుల్జా భవానికి ప్రత్యేక పూజలు



పుల్‌కల్(అందోల్): తుల్జాభవాని దేవాలయంలో ఆయా గ్రామాల భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం మండలంలోని పెద్దారెడ్డిపేటలో తుల్జా భవాని ఆలయంలో జాతర మహోత్సవం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు తీశారు. కలశ పూజలో మహిళలు పాల్గొని భక్తి పాటలు పాడారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రహదారి మరమ్మతులు చేపట్టాలి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నుంచి ఇంద్రేశం పెద్ద కంజర్ల మీదుగా దౌల్తాబాద్ వెళ్లే రహదారి టిప్పర్లు, లారీలు తిరగడంతో రోడ్డంతా ధ్వంసమైంది. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అదనపు కలెక్టర్‌కు సోమవారం సంగారెడ్డి ప్రజావాణిలో బీజేపీ శ్రేణులు వినతిపత్రం అందజేశారు. గుంతలమయమైన రోడ్డు కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వీరేశం, నాయకులు రాజిరెడ్డి, ఓబీసీ మండల అధ్యక్షుడు రవీందర్, ధనుంజయగౌడ్ పాల్గొన్నారు.

ముత్తంగిలో మంచినీటి సమస్య

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగిలో 45 రోజుల నుంచి మంచినీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అదనపు కలెక్టర్‌కు ముత్తంగి వాసులు సంగారెడ్డిలో ప్రజావాణిలో వివరించారు.

యువకుడి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా, గాంధారి మండలం.. లొంకతండాకు చెందిన రవి(23), నెల రోజుల క్రితం డివిజన్‌లోని గౌతమ్‌నగర్ కాలనీకి వచ్చి, కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో 16న గ్రామంలో ఉండే తన బాబాయ్ ప్రేమ్‌సింగ్‌కి ఫోన్ చేసి ఇంటికి వస్తున్నానని చెప్పాడు. రాకపోవడంతో కుటుంబ సభ్యులు రవికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో బాబాయ్ ప్రేమ్‌సింగ్ పటాన్‌చెరుకి వచ్చి చూడగా, రూంకు తాళం వేసి ఉంది. తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.